సాక్షి
నిర్మల్
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



ఆధారాలు లేకుంటే జప్తే..!

ఎన్నికల నేపథ్యంలో పెద్ద మొత్తంలో నగదుతో బయటకు వెళ్లినా, ప్రయాణాలు చేసినా ఇబ్బందే. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులకు దొరికితే జప్తు చేస్తారు. 8లో▸



భైంసాలో విషజ్వరాల పంజా!

భైంసా పట్టణవాసులు విషజ్వరాలతో విలవిలలాడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఒకరు జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వర లక్షణాలతో బాధపడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.4 /23.6

వాతావరణం

వాతావరణం పొడిగా, చాలా వరకు ఎండగా ఉంటుంది. అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటును అమ్ముకోవద్దు



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పౌరులు ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్(స్వీప్) ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కోసం సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటింగ్ ప్రాముఖ్యతను వివరిస్తూ స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు వారి గ్రామాల్లో అవగాహన కల్పించి అందరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మామడ ఎంపీడీవో రమేశ్, నిర్మల్ సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, పీఈటీలు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్ పీజీ.రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. సమస్య త్వరగా పరిష్కారం అవుతుందనే నమ్మకంతో ప్రజలు ఇక్కడికి వస్తారన్నారు. వాటిని జిల్లా అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే ఫిర్యాదుదారులకు అక్కడే అవగాహన కల్పించాలని తెలిపారు. సమస్య తీవ్రతను బట్టి పై అధికారులకు పంపించాల్సి ఉంటే ఫిర్యాదులను పంపిస్తూ, ఆ కాపీని ఫిర్యాదుదారునికి సైతం పంపించాలని సూచించారు. ఒక సమస్యపై ఫిర్యాదుదారుడు పలుమార్లు వచ్చే పరిస్థితి ఉండకూడదని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులకు అధికారులు తొలి ప్రాధాన్యం ఇచ్చి వారి నమ్మకాన్ని నిలబెట్టాలని ఆదేశించారు. ప్రజావాణికి 36 ఫిర్యాదులు రాగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించారు.

చేరుకున్న డయాలసిస్ పరికరాలు



డయాలసిస్ పరికరాలు దించుతున్న సిబ్బంది

భైంసాటౌన్: కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారి కోసం భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రికి ఐదు పడకలతో డయాలసిస్ కేంద్రం మంజూరైంది. ఈ మేరకు ముంబయి నుంచి ప్రత్యేక వాహనంలో డయాలసిస్‌కు సంబంధించిన యంత్ర పరికరాలు సోమవారం భైంసా ఆస్పత్రికి చేరుకున్నాయి. దీంతో త్వరలోనే కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై రేపు శిక్షణ

నిర్మల్ రూరల్: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సందర్భంగా బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం టీఎస్‌సీవోఎస్‌టీ ఆధ్వర్యంలో 10 నుంచి 17 ఏళ్లలోపు విద్యార్థులకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహణ ఉంటుందన్నారు. ఈ ఏడాది 'ఆరోగ్యం మరియు సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనే ప్రధాన అంశంపై విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేయాల్సి ఉంటుంది. శిక్షణ కార్యక్రమంలో ఈ ప్రాజెక్టుల రూపకల్పన గురించి వివరిస్తారన్నారు. నవంబర్‌లో జిల్లాస్థాయి మేళా ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అన్ని యజమాన్యాల (ప్రభుత్వ, ప్రైవేట్-సంక్షేమ) పాఠశాల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయుడు హాజరు కావాలన్నారు. భైంసా డివిజన్ ఉపాధ్యాయులకు భైంసా పట్టణంలోని వేదం హైస్కూల్‌లో 10 నుంచి 12:30 గంటల వరకు, ఖానాపూర్, నిర్మల్ జిల్లా డివిజన్ ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్ లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు శిక్షణ ఉంటుందని వివరించారు. వివరాలకు సైన్స్ అధికారి కె.వినోద్‌కుమార్‌ను 94400 69830 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోడ్ కూసింది..

- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఈసీ
- కోడ్ అమలులోకి రావడంతో కొత్త పనులకు బ్రేక్..
- పాత పనులు, పథకాలు కొనసాగే అవకాశం
- పోలీసు చెక్‌పోస్టుల్లోనూ తనిఖీలు
- ఎక్కువ మొత్తం నగదు ఉంటే సీజ్
- ఎన్నికల పనుల్లో అధికారులు బిజీ
- కొత్త మండలాల ఏర్పాటుపై సందిగ్ధత



తనిఖీలు నిర్వహిస్తున్న రూరల్ సీఐ ,ఎస్సై

నిర్మల్: ఎన్నికల కోడ్ వచ్చేసింది. ఇక 52 రోజుల పాటు అధికారుల పాలనే సాగనుంది. ఐదేళ్లు అభివృద్ధి పనులంటూ తిరిగిన మంత్రులు, ఎమ్మెల్యేలు అభ్యర్థులుగా ప్రతిపక్షాలతో తలపడే సమయం ఆసన్నమైంది. కేంద్ర ఎన్నికల కమిషన్ సోమవారం మధ్యాహ్నం షెడ్యూల్‌ను ప్రకటించిన మరుక్షణమే జిల్లాలోనూ కోడ్‌ను అమలు చేస్తున్నట్లు కలెక్టర్, ఎస్పీలు పేర్కొన్నారు. ఈమేరకు అన్నిశాఖల్లో చర్యలు మొదలయ్యాయి. మరోవైపు ఎన్నికల కోడ్ రావడంతో కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికే శంకుస్థాపనలు చేసిన పనులు మాత్రం కొనసాగించుకునే అవకాశం ఉంది. ఈక్రమంలోనే చివరిరోజుల్లో శరవేగంగా శంకుస్థాపనలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియపైనా సందిగ్ధత నెలకొంది. జిల్లాలో నాలుగు మండలాలకు ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిపై ఎలా స్పందిస్తారో తెలియాల్సి ఉంది. కోడ్ అమలు ఉన్నందున అవసరానికి మించి, పెద్దమొత్తంలో నగదును తీసుకెళ్లవద్దని పోలీసులు సూచిస్తున్నారు. జిల్లా నలువైపులా చెక్‌పోస్టుల్లో తనిఖీలు ప్రారంభించారు.

ఎన్నికలయ్యే దాకా..

నిన్నటిదాకా మంత్రులు, ఎమ్మెల్యేల రాజ్యం నడిచింది. ఇక ఎన్నికలయ్యే దాకా అధికారుల పాలన సాగనుంది. ఏ పనిచేపట్టాలన్నా అధికారిక అనుమతి తప్పనిసరి. జిల్లాలో నాలుగైదు రోజుల నుంచి కొత్త అభివృద్ధి పనులకు శరవేగంగా శంకుస్థాపనలు, ఇప్పటికే పూర్తయిన వాటి ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఎన్నికల కోడ్‌కు ముందు ప్రారంభించిన ప్రభుత్వ పథకాలు యథావిధిగా కొనసాగుతాయి. కొత్తగా ఎలాంటి కార్యక్రమాలను అమలు చేయవద్దని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. గతంలో లబ్ధిదారులు ఎంపికైనవి కూడా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఇకపై ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం పథకాల అమలు కార్యక్రమాల్లో కేవలం అధికారులు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుంది. నాయకులెవరూ పాల్గొనే అవకాశం ఉండదు. అలాగే అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు పార్టీలకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనడం, అభ్యర్థులను కలువడం చేయొద్దని ఎన్నికల సంఘం ఆదేశించింది.

రంగంలోకి అధికారులు..

ఎన్నికల కోడ్ రావడంతో రాజకీయ ఒత్తిళ్ల నుంచి అధికారులు బయటపడ్డారు. ఇక ఇప్పుడంతా వారి చేతుల్లోనే. విధులతోపాటు పాలననూ వారే అజమాయిషీ చేస్తారు. ఎన్నికల కోడ్ పూర్తిస్థాయిలో అమలులోకి రావడంతోనే మంత్రి, ఎమ్మెల్యేల వద్ద ఉన్న ప్రభుత్వ సిబ్బంది సైతం వెనక్కి వచ్చేశారు. ప్రభుత్వ పీఏలు తమ సొంతశాఖల్లోకి వెళ్లిపోయారు. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించగానే.. ఇక నుంచి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏంచేయాలి.. ఎలాచేయాలి.. అనే దానిపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాలపై అధికార పార్టీ ఫొటోలు, గుర్తులు, చిహ్నాలను తొలగిస్తున్నారు. నేతల విగ్రహాలకు ముసుగులు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నగదు జాగ్రత్త..

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసుల పర్యవేక్షణ, తనిఖీలు మొదలయ్యాయి. జిల్లా నలువైపులా చెక్‌పోస్టులలో పకడ్బందీగా తనిఖీలు చేపట్టనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. అధిక మొత్తంలో డబ్బులను తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. రూ.50 వేల వరకు తీసుకెళ్తున్నా పక్కా ఆధారాలు ఉండాలంటున్నారు. అవసరం లేకున్నా.. అవగాహన లేకుండా పెద్ద మొత్తంలో నగదు తరలిస్తూ ఇబ్బందులు పడొద్దని సూచిస్తున్నారు.

కొత్త మండలాల సంగతేంది..

జిల్లాలో ఇటీవల నాలుగు కొత్త మండలాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రాథమిక నోటిఫికేషన్లు విడుదల చేశారు. పొన్కల్, బెల్తారోడ, మాలేగాం, బీరవెల్లిని కొత్త మండలాలుగా ప్రకటిస్తూ నోటిఫికేషన్లు ఇచ్చారు. ఈ ప్రకా రం అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలిపేందుకు 15 రోజుల గడువు ఇచ్చారు. ఇంతలో సోమవారం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కొత్త మండలాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుందా.. లేక బ్రేక్ పడుతుందా.. అనే విషయంపై స్పష్టత లేదు. కోడ్‌కు ముందే నోటిఫికేషన్ ఇచ్చినందున మండలాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

- జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్



సేవలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ సునీల్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ అన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సోమవారం ప్రతీ వార్డును తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పడిన తర్వాత జిల్లా ఆసుపత్రి జనరల్ ఆసుపత్రిగా మారిందన్నారు. రోగులకు సేవలలో ఎటువంటి ఆటంకాలు రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ భారతి, కమల ఉన్నారు.

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

నిర్మల్ రూరల్: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీయూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఆ కాపీని డీఈవో రవీందర్‌రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా సజావుగా బదిలీ ప్రక్రియ కొనసాగుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పూర్తయిన తర్వాత జరుగుతున్న పలు కేటగిరీ బదిలీల్లో ఉపాధ్యాయులు జాయిన్ కావాలంటే సబ్‌స్టిట్యూట్ తప్పనిసరి అని ప్రభుత్వం షరతు విధించడం తగదన్నారు. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోందన్నారు. బోధన సజావుగా జరిగేందుకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి స్థానాల్లో వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు.

పకడ్బందీగా ప్రవర్తన నియమావళి

- రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు




వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, దీనిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్లతో సోమవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ 24 గంటల్లో ప్రతీ ప్రభుత్వ భవనాలలో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫొటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలన్నారు. 48 గంటల వ్యవధిలో హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫొటోలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫొటోలను 72 గంటల్లో తొలగించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్, జిల్లా వెబ్‌సైట్‌లలో మంత్రుల ఫొటోలు, ముఖ్యమంత్రి ఫొటోలు తొలగించాలన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలన్నారు. నవంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అప్పటి వరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది శిక్షణ, తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలు సమర్పించాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదే రోజు అందించే విధంగా పని చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి రిపోర్ట్‌లు ప్రతిరోజూ సమర్పించే విధంగా జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో దివ్యాంగుల ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేసుకోవాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఇతర ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు సేకరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో రిటర్నింగ్ అధికారులకు భద్రత ఏర్పాటు చేయాలని, అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే సమయంలో నిబంధనలు పాటిస్తూ నామినేషన్‌లో అన్ని అంశాలు నింపారో లేదో చెక్ చేసుకోవాలని, నింపని పక్షంలో సదరు అభ్యర్థులకు రాత పూర్వకంగా సమాచారం అందించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు ప్రభుత్వ మిషనరీ ఎన్నికల కోసం వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. సమాచారం, ఫిర్యాదుల కోసం 93987 49227 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మోకుదెబ్బ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు



అమరవేణి నర్సాగౌడ్

నిర్మల్‌చైన్‌గేట్: గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు పురస్కరించుకొని హైదరాబాదులో నిర్వహించిన రాష్ట్ర మూడో మహాసభలలో సోమవారం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన అమరవేణి నర్సాగౌడ్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఇల్లందుల రాజాగౌడ్, కోశాధికారిగా గరుగుల మురళీగౌడ్, అధికార ప్రతినిధిగా అనుపురం వెంకటరమణగౌడ్, గౌరవ సలహాదారుగా కోలా జీవన్‌గౌడ్, కార్యవర్గ సభ్యులుగా మేడి నారాగౌడ్ ఎన్నికయ్యారు.

దాబాల్లో తనిఖీ



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఏఎస్పీ

భైంసాటౌన్: ఎన్నికల నియమావళి తప్పని సరిగా పాటించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. పట్టణంలోని పలు దాబాల్లో సోమవారం సాయంత్రం సోదాలు నిర్వహించారు. ఆరు దాబాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 105 బీరు సీసాలు, 24 లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు నిర్వాహకులపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేయవద్దన్నారు. కోడ్ అమలు నేపథ్యంలో ఎక్కడైనా ప్రలోభాలకు గురిచేసినా, డబ్బులు, తాయిలాలు పంచినా పోలీసులకు లేదా ఎన్నికల కమిషన్ హెల్ప్‌లైన్ నంబర్ 1950 కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సివిజిల్ యాప్‌లో సైతం ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఏఎస్పీ వెంట సీఐ ఎల్.శ్రీను, ఎస్సైలు శ్రీకాంత్, సందీప్ ఉన్నారు.

కోడ్‌కు ముందే స్పీడ్‌గా..



వివిధ కుల సంఘాల నాయకులకు మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- శరవేగంగా శంకుస్థాపనలు
- జిల్లాకేంద్రంలో ఒకే రోజు.. పలు పనుల ప్రారంభం
- అన్నింటిలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఎన్నికల కోడ్ వస్తుందన్న విషయం ఒక్కరోజు ముందు తెలియడంతో అధికార పార్టీ ఆగమేఘాల మీద పనులు చేపట్టింది. జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కోడ్ రాకముందే స్పీడ్‌గా పనులను చేపట్టారు. పలు వార్డుల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా ప్రారంభించిన పనులను ఎన్నికల కోడ్ ఉండగానూ కొనసాగించవచ్చన్న ఉద్దేశంతో ఆయా కార్యక్రమాలను వేగంగా పూర్తిచేశారు. చివరగా స్థానిక దివ్య గార్డెన్‌లో వివిధ కుల సంఘాల భవన నిర్మాణాలకు మంజూరైన ఉత్తర్వుల పత్రాలు పంపిణీ చేశారు.

మంత్రి చేపట్టిన కార్యక్రమాలు..

- జిల్లా కేంద్రంలోని బ్రహ్మపురి చౌరస్తా వద్ద 6, 7, 8, 26 వార్డులకు సంబంధించిన రూ.1.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- నాగేశ్వర్‌వాడ చౌరస్తా వద్ద 9, 29, 30, 31, 34, 41 వార్డులకు సంబంధించిన రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.
- ద్యాగవాడ చౌరస్తా వద్ద 27, 28, 39, 40, 42 వార్డుల్లో చేపట్టే రూ.1.60 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు.
- స్థానిక శాంతినగర్ చౌరస్తా వద్ద పీవీ.నరసింహారావు విగ్రహావిష్కరణ చేశారు.
- దివ్య గార్డెన్‌లో వివిధ కుల సంఘాల భవన నిర్మాణాలకు మంజూరైన సుమారు రూ.12 కోట్ల నిధులకు సంబంధించిన ఉత్తర్వుల పత్రాలను ఆయా కుల సంఘాలకు పంపిణీ చేశారు.
- వాడవాడకూ సీసీ రోడ్లు, డ్రైనేజీలు

పట్టణంలోని 42 వార్డుల్లో వాడవాడకూ సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. టీయూఎఫ్ఐసీడీ కింద మంజూరైన రూ.50 కోట్లు, సీఎం స్పెషల్ ఫండ్ రూ.25 కోట్ల నిధులతో ప్రతీ వాడలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్ నిర్మించి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అనంతరం కాలనీవాసులు మంత్రిని సత్కరించారు.

నాకోసం మీరు చేయండి

నాలుగేళ్ల పది నెలలు మంత్రిగా ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేశారని, వచ్చే 50 రోజులు తన కోసం ప్రజలు పని చేయాలని మంత్రి కోరారు. ప్రతీ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు, నాయకులు మంత్రిగా తను చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. తన రాజకీయ జీవితంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ప్రజలకు అన్నిరకాల సేవ చేసి తృప్తి చెందానని పేర్కొన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో సుమారు 80 వేల పింఛన్లు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, కమిషనర్ రాజు, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు కొత్త ఆరోగ్యపథకం

- ఆరోగ్య సంరక్షణ ట్రస్టు ఏర్పాటు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రయోజనం
- జిల్లాలో 8 వేల మందికి లబ్ధి

నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నూతన ఆరోగ్య పథకాన్ని అమలు పరిచేందుకు కొత్త ట్రస్టు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి నేతృత్వంలో ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్ల కోసం ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ఏర్పాటుకు నిర్ణయించింది. ఈ పథకం ద్వారా జిల్లాలోని దాదాపు 8 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ పథకంలో ప్రతీనెల ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల మూల వేతనం నుంచి నిర్దేశిత మొత్తాన్ని జమ చేస్తారు. అంతే మొత్తంలో ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ రూపంలో దానికి జత చేస్తారు. ఈ నిధిని ట్రస్టు ఆధ్వర్యంలో ఉంచుతారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య సమస్యల రీత్యా వైద్యం కోసం కార్పొరేట్ సేవలు పొందడమే లక్ష్యంగా ఈ పథకం అమలులోకి రానుంది. త్వరలో విధివిధానాలు ఖరారు కానున్నాయి. ఈ పథకం అందుబాటులోకి వస్తే ఉద్యోగులు పెన్షనర్లకు పూర్తిగా నగదు రహిత వైద్యం పొందగలుగుతారు.


జిల్లాలో 8 వేల మందికి ప్రయోజనం..

జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖలో అత్యధికంగా ఉపాధ్యాయులు 2,600 వరకు ఉండగా, ఇతర అన్నిశాఖల ఉద్యోగులు మరో 2,500, పెన్షనర్లు దాదాపు 2,900 కలిపి మొత్తం 8 వేలకుపైగా మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఈ పథకం కింద ప్రయోజనం పొందనున్నారు. ప్రస్తుతం వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్, హెల్త్ కార్డుల విధానంలో కొనసాగుతున్నాయి. వీటి అమలులో తాత్సారంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అంశంపై ప్రభుత్వానికి వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తులు చేయగా ఇందుకు సంబంధించిన హెల్త్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా...

ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ నిధి పథకంగా ఈ పథకం పిలవబడుతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నెట్వర్క్ హాస్పిటల్స్ ద్వారా నగదు రహిత చికిత్స అందించడం ఈ పథకం లక్ష్యం. నూతన ఆరోగ్య సంరక్షణ పథకం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని దీనికి అయ్యే మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని సూచిస్తున్నారు.


స్వాగతిస్తున్నాం...



ఉద్యోగుల ఆరోగ్య బాధ్యతలను ప్రభుత్వమే తీసుకుంటుందని సీఎం కేసీఆర్ ప్రకటించినట్టుగానే నూతన ఈహెచ్ఎస్‌ను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వరంగంలో సేవలందిస్తూ అనారోగ్యంపాలై వైద్యకోసం దవాఖానాల చుట్టూ తిరుగుతున్న ఎంతో మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ పథకంతో ఉపశమనం కలుగుతుంది.

– వి.ప్రభాకర్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు


పటిష్టంగా అమలు చేయాలి...



రాష్ట్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పటిష్టమైన నెట్వర్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తూ ఈ పథకం అమలు చేయాలి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు హాస్పిటల్లో వెంటనే రీయింబర్స్‌మెంట్ కల్పించే ఏర్పాటు చేయాలి. స్కీం అమలు బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలి.

– ఎ.విజయ్ కుమార్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరించాలి..



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగుల నూతన ఆరోగ్య సంరక్షణ పథకం నిర్ణయం ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే ఉద్యోగులు మూలవేతనం నుంచి కాంట్రిబ్యూషన్ స్వీకరించే కంటే పూర్తి మొత్తాన్ని ప్రభుత్వమే భరించి ఈ పథకాన్ని అమలు చేయాలి. ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలి..

– పెంట అశోక్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడి మృతి


ఎర్రన్న(ఫైల్)

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామానికి చెందిన సంగని ఎర్రన్న (100) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఎర్రన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతుర్లు ఉన్నారు.

అటవీ అధికారులకు దుప్పిపిల్ల అప్పగింత


అధికారికి దుప్పిని అందిస్తున్న ఎస్సై యాసిర్ అరాఫత్

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, మాడేగాం కాల్వను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతం పరిసరాల్లోని పంటచేనులో పాపన్న అనే రైతుకు సోమవారం దుప్పి పిల్ల కనిపించింది. దానిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రైతు అప్పజెప్పాడు. ఎస్సై యాసిర్ అరాఫత్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. అక్కడికి చేరుకున్న ఫారెస్ట్ బీట్ అధికారి ముస్తాక్‌కు దుప్పి పిల్లను ఎస్సై అందజేశాడు. ఇందులో దిలావర్‌పూర్ అటవీ పరిధి వాచర్ ధనె పోశెట్టి ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎదులాపురం: ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తాటిగూడ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కే అయాన్ శనివారం రాత్రి పట్టణంలోని జై జవాన్‌నగర్ నుంచి తాటిగూడకు క్రాంతినగర్ మీదుగా వెళ్తున్నాడు. బబ్లూ అనే వ్యక్తి ద్విచక్ర వాహనం రహదారిపై అడ్డంగా ఉంచాడు. ఆ వాహనాన్ని పక్కకు తీయమనడంతో బబ్లూ, అతడి కుమారుడు ఆఫ్తాబ్, సోదరుడు అయాన్ కర్రలతో ఆటో డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

ఎదులాపురం: కర్రలతో దాడిచేసి గాయపరిచిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై ప్రదీప్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పట్టణంలోని తాటిగూడకాలనీకి చెందిన అక్బర్ అనే వ్యక్తిపై ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్‌లో పట్టణానికి చెందిన ముజాహిద్, రవి, ప్రకాశ్ దాడికి పాల్పడ్డారు. ఇటీవల పార్కింగ్ బ్యానర్ చించివేశావంటూ ఆరోపిస్తూ అక్బర్‌పై కర్రలతో దాడి చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపాడు.

జ్వరంతో బాలుడి మృతి


ఆర్యన్(ఫైల్)

తాంసి: జ్వరంతో బాలుడు మృతిచెందిన సంఘటన భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... దప్కాల నవనీత్, నిఖిత దంపతుల కుమారుడు ఆర్యన్(7) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో వసతి గృహంలో ఉంటూ రెండో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి బాలుడికి జ్వరంతో పాటు ఫిట్స్ రావడంతో వసతిగృహ నిర్వాహకులు తల్లితండ్రులకు సమాచారం అందించి రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహారాష్ట్రలోని యావత్మాల్‌కు, అక్కడి నుంచి వార్ధాకు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవించే ఈ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో వారి రోదనలు మిన్నంటాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముథోల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం... న్యూముథ్గల్ గ్రామానికి చెందిన గాడేకర్ హరీష్ (33) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి కాలినడకన బయటకువెళ్లాడు. మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు 108లో భైంసా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య అర్చన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపాడు.

ఆధారాలు లేకుంటే జప్తే..!

- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్
- నగదుకు ఆధారాలు లేకుంటే జప్తే..
- మనీ, మద్యం, ఆయుధాల రవాణపై డేగ కన్ను
- ఖాకీల ముందస్తు ప్రణాళిక
- ఇప్పటికే ఎస్పీలతో సీపీ సమావేశం


గూడెం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాలక్రైం: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా పెద్ద మొత్తంలో నగదుతో బయటకు వెళ్లినా ప్రయాణాలు చేసినా తస్మత్ జాగ్రత్త.. నేటి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అధిక మొత్తంలో డబ్బులతో పోలీసులకు దొరికితే జప్తు.. లేదా పేకాట పేరుతో కేసులు నమోదు చేయనున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం ఇప్పటికే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రధానంగా ఎన్నికల నేపథ్యంలో పెద్దమొత్తంలో డబ్బు, మద్యం, ఆయుధాలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అంతర్‌జిల్లా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిరంతరం వాహనాలు తనిఖీ చేయాలని సూచించారు.

ఆధారాలు లేకుంటే జప్తే...

ఎన్నికల సమయంలో నగదు, బంగారం, మద్యం పెద్ద మొత్తంలో తీసుకెళ్లకూడదు. సొంతడబ్బు అయినా లెక్క చూపాల్సిందే. రూ.50 వేలకు పైగా డబ్బులు తీసుకెళ్లాల్సి వస్తే వాటికి తగిన ఆధారాలు చూపించాలి. లేదంటే జప్తు చేయక తప్పదు. ఎక్కువ మాట్లాడితే పేకాట పేరుతో కేసులు నమోదు చేయడం ఖాయం.

బ్యాంకు నుంచి విత్‌డ్రా చేస్తే ...

బ్యాంకు నుంచి రూ.50 వేలకంటే ఎక్కువగా విత్‌డ్రా చేస్తే ఆధారాలు అవసరం. బ్యాంకు అధికారి ఇచ్చిన ఓచర్ స్లిప్ విధిగా వెంట ఉంచుకోవాలి. సెల్ఫ్ చెక్ ద్వారా అయితే సంబంధిత చెక్ జిరాక్స్ కాపీ, ఏటీఎం ద్వారా డ్రా చేస్తే మిషన్ ద్వారా వచ్చిన స్లిప్ వెంట ఉంచుకోవాలి. ఒకవేళ బ్యాంకులో డిపాజిట్ చేయాలనుకుంటే వ్యక్తిగత డిక్లరేషన్, బ్యాంకు పాస్‌బుక్ వెంట ఉంచుకోవాలి.

రికవరీ ఏజెంట్లు...

ఏదైనా సంస్థలో రికవరీ ఏజెంట్లుగా పనిచేసేవారైతే పనిచేస్తున్న కంపనీ గుర్తింపుకార్డు, కలెక్షన్ చేయాల్సిన బాధితుడి పేరు, సెల్‌నంబర్‌తో కూడిన లిస్టు, ఆరోజు ఎవరెవరు ఎంత కలెక్షన్ ఇచ్చారో వారి సంతకంతో కూడిన వివరాలు అధికారులకు చూపించాలి.

అప్పుగా తీసుకుంటే ...

అవసరం నిమిత్తం ఎవరి వద్దనైనా అప్పుగా తీసుకుని వెళ్తుండగా పోలీసులకు పట్టుబడితే ఎవరివద్ద తీసుకున్నారు? ఎప్పుడు తీసుకున్నారు? ఎంత తీసుకున్నారు? తదితర వివరాలతో పాటు ప్రామిసరీ నోటు వెంట ఉంచుకోవాలి. ఒకవేళ ఆస్పత్రి బిల్లులు కట్టాల్సివస్తే పేషెంట్ పేరు, ఆస్పత్రికి సంబంధించిన బిల్లులు వెంట ఉంచుకోవాలి.

నిబంధనలు తప్పనిసరి

ఆదాయ పన్ను చట్టం 1961 సెక్షన్ 69–ఏ ప్రకారం ఎవరైనా తమవద్ద ఉన్న డబ్బు, బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఒకచోట నుంచి మరోచోటుకు తరలించే ముందు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించడం తప్పనిసరి.

ఆధారాలు లేకుంటే అంతే..

రానున్న సాధారణ ఎన్నికల దృశ్యా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. ఇలాంటి సమయంలో పెద్దమొత్తంలో నగదు పట్టుబడితే తగిన ఆధారాలు చూపించని పక్షంలో డబ్బు జప్తు చేయబడుతుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి డబ్బు తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటారు. ఆధారాలు చూపించకుంటే వాటిని ఆదాయపుపన్ను శాఖ ఖాతాలో వేస్తారు. అక్కడి నుంచి డబ్బు పొందాలంటే చుక్కలు లెక్క పెట్టాల్సిందే. లేదంటే ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆధారాలు సరిగా లేకపోతే 30 శాతం పన్నుకింద తీసుకుని మిగతా డబ్బులు ఇస్తారు. ఈ నిబంధనలు తెలియక చాలామంది పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్తూ చెక్‌పోస్టుల వద్ద పట్టుబడుతుంటారు.

డిప్యూటీ ఆర్‌ఎంగా ప్రవీణ్‌కుమార్


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రవీణ్‌కుమార్

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెయింటెనెన్స్)గా కే. ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ డీఎం(ఎం)గా బాధ్యతలు నిర్వర్తించిన సురేశ్‌చౌహాన్‌ను సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్‌ఎం (మెయింటెనెన్స్)గా బదిలీపై వెళ్లారు.

వాహనాల తనిఖీ

నిర్మల్ రూరల్: ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీలు ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం మంజులాపూర్‌లో జాతీయ రహదారిపై రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ వెంట రూ.50 వేల కన్నా ఎక్కువ డబ్బులు తీసుకెళ్తే రశీదు వెంట ఉంచుకోవాలని సూచించారు.

డబ్బులు పట్టివేత

సారంగాపూర్: మండల కేంద్రంలో సోమవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించగా మండలంలోని మలక్‌చించోలికి చెందిన దాసరి లక్ష్మణ్ వద్ద రూ.లక్షా ఆరువేలు పట్టుబడినట్లు ఎస్సై కృష్ణాసాగర్ రెడ్డి తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీవో3 పునరుద్ధరణకు ఆర్డినెన్స్ జారీ చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్


నిరసన తెలుపుతున్న ఆదివాసీ నాయకులు

ఎదులాపురం: ఏజెన్సీలో వందశాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబర్ 3 పునరుద్ధరణకు కేంద్రం తక్షణమే ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. అమిత్ షా ఆదిలాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో ఈ మేరకు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలకు వ్యతిరేకంగా పర్యావరణ అటవీ చట్టాన్ని తీసుకొచ్చి అడవులను ప్రైవేటీకరణ చేస్తోందని విమర్శించారు. అలాగే ఏజెన్సీలో వందశాతం ఉద్యోగాలు కల్పించే జీవో.3 పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం అడవులను ప్రైవేటీకరణ చేస్తూ ఆదివాసీలపై ప్రేమ ఉన్నట్టు మొసలి కన్నీరు కారుస్తుందని విమర్శించారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆదివాసీలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. అమిత్ షాకు ఆదివాసీల పై ప్రేమ ఉంటే వెంటనే జీవో.3 పునరుద్ధరణ కోసం పార్లమెంట్‌లో ఆర్డినెన్స్ జారీ చేసి అమలు చేయాలన్నారు. ఇందులో ఆదివాసీ నాయకులు సిడాం దౌలత్‌రావు, మడావి జాలీమ్ శావ్, కుమ్ర భీంరావు, సుంగ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం


కలెక్టరేట్ గేట్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కైలాస్‌నగర్: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని కుండి షేక్‌గూడ గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ గాదిగూడ మండలంలోని కుండి షేకుగూడ ఏర్పడి 70ఏళ్లు గడిచిన రోడ్డు సౌకర్యం లేదన్నారు. తమ గ్రామంతో పాటు కొలాంగూడ, మారుతిగూడ చిన్నకుండి, పిప్పిరి గ్రామం వరకూ వెళ్లాలంటే ఏడు కిలోమీటర్ల వరకు నాగులు వంకలు దాటుతూ కాలినడకన వెళ్లాల్సి వస్తుందని వివరించారు. అనారోగ్యం పాలైన వారిని ఝరి పీహెచ్‌సీకి చేర్చాలంటే ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుందని, గర్భిణులు నడక యాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లేందుకు పోలీసులు నిరాకరించడంతో గేటుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడాం దౌలతీ రావు కుంరం భీంరావు సిడాం పరశురాం, చిత్రు, గోవిందరావు పాల్గొన్నారు.

గంజాయి సాగుచేసిన ముగ్గురి అరెస్టు

- రూ.36లక్షల గంజాయి మొక్కల స్వాధీనం..


వివరాలు వెల్లడిస్తున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్

ఉట్నూర్‌రూరల్: గంజాయి సాగుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ హెచ్చరించారు. వ్యవసాయ చేనులో గంజాయి సాగు చేస్తున్న ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగేందర్ వెల్లడించాడు. మండలంలోని నర్సాపూర్-బి పంచాయతీ పరిధిలోని పెందూర్‌గూడ గ్రామానికి చెందిన పెందూర్ మారుతికి సంబంధించి వ్యవసాయ చేనులో 130 గంజాయి మొక్కలు, ఆడ జగన్నాథ్ చేనులో 30, దుర్వ నాగోరావు చేనులో 200 గంజాయి మొక్కలు సాగు చేస్తుండగా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ దాడులు చేసి పట్టుకున్నారు. వాటి విలువ సుమారుగా రూ.36 లక్షలు ఉంటుందని, వెంటనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ఏజెన్సీలో గిరి రైతులు గంజాయి మొక్కలను సాగుచేసి జైలుపాలు కావద్దన్నారు. సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు నిలిపివేయాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

నిర్మల్ రూరల్: తమ ఊరి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో తమ పిల్లలు చదువులో రాణిస్తున్నారని, ఉపాధ్యాయుల కృషితో జాతీయ గుర్తింపు వచ్చిందని, ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులను బదిలీ చేయవద్దని కుంటాల మండలం పెంచికల్‌పాడ్ గ్రామస్తులు డీఈవోకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోధించే ఎల్లన్న వచ్చిన తర్వాత విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందుతోందన్నారు. గ్రామ విద్య ప్రాజెక్టు ద్వారా పాఠశాలకు అదనపు సమయం కేటాయించి విద్యార్థులకు బోధిస్తున్నారన్నారు. పాఠశాల నుంచి ప్రతీ సంవత్సరం గురుకుల, నవోదయ సీట్లు లభిస్తున్నాయన్నారు. ఎన్జీవోల సహకారంతో విద్యార్థుల కోసం ఆట వస్తువులు విరాళాలు సేకరించి డిజిటల్ విద్యను అందిస్తున్నారన్నారు. 5వ తరగతిలో నిరుపేద విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారన్నారు. ఇలాంటి మంచి పనులు చేస్తున్న తమ ఉపాధ్యాయుడిని ఎట్టి పరిస్థితుల్లో బదిలీ చేయొద్దని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సర్పంచ్ కదం భోజబాయ్, ఎస్‌ఎంసీ చైర్మన్ బాబారావు, వైస్ చైర్మన్ అనిత, గ్రామస్తులు లక్ష్మణ్, ఆనంద్, గణేశ్, నవీన్, ముత్తవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే

- డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే అని తెలంగాణ సమాజానికి పూర్తిగా అర్థమైందని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు కోరారు. సర్సాపూర్(జి) మండలం అంజనీతండా గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరిరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప గడచిన తొమ్మిదేళ్లలో ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ డ్రామాలు ఆడుతూ కొత్త పథకాలు ప్రకటిస్తున్నారని విమర్శించారు. రాబోవు రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

భర్త, అత్తమామ, ఆడబిడ్డకు ఏడేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: భార్య మరణానికి కారణమైన భర్త, అత్తమామలు, ఆడబిడ్డకు నిర్మల్ న్యాయస్థానం ఏడేళ్ల కఠిన కరాగారా జైలుశిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని బోరిగామ్ గ్రామానికి చెందిన బైరెడ్డి రాంరెడ్డికి మామడ మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన బైరెడ్డి శ్రీలత(27)తో 2012లో పెద్దల సమక్షంలో పెళ్లి చేశారు. వరకట్నంగా రూ.3లక్షలు, 8తులాల బంగారం, ఇతర సామగ్రి అందించారు. పెళ్లైన కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగింది. ఒప్పుకున్న మిగితా రూ.లక్ష తీసుకురావాలని భర్త, అత్తమామ, ఆడబిడ్డలు మానసికంగా, శరీరకంగా చిత్రహింసలకు గురిచేయడం మొదలుపెట్టారు. దీంతో శ్రీలత వారు పెట్టే బాధలు తట్టుకోలేక పుట్టింటికి వెళ్లినప్పుడల్లా కుటుంబ సభ్యులు నచ్చజెప్పి పంపించేవారు. రెండేళ్ల తరువాత వారికి అంగవైకల్యంతో పాప జన్మించింది. ఆ పాప పేరు మీద రూ.5లక్షలు డిపాజిట్ చేసేందుకు డబ్బులు కావాలని, మోటార్ సైకిల్ కొనివ్వాలని వేధించడం మొదలుపెట్టారు. దీంతో శ్రీలత బంధువులు బోరిగామ్‌లో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టి అత్తింటికి పంపించారు. మళ్లీ కొన్ని రోజుల తరువాత భర్తతో పాటు అత్త రాజవ్వ, మామ గంగారెడ్డి, ఆడబిడ్డ గంగామణి పాప ఆస్పత్రి ఖర్చులకు డబ్బులు కావాలని వేధించడం మొదలుపెట్టారు. ఆ బాధ భరించలేక 18 జులై 2015 పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో శ్రీలత తమ్ముడు లింగారెడ్డి సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై, ప్రస్తుత నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్, అప్పటి డీఎస్పీ మనోహర్ కేసు నమోదు చేసి నేరస్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు 19 మందిని సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో ఏడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పునిచ్చారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. బెజ్జూర్ మండలం కూడా గ్రామానికి చెందిన కె.భారతి తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇప్పించాలని కోరింది. తలమడుగు మండలం పల్సి గ్రామానికి చెందిన మడావి ఆశ్విని బీఈడీ కళాశాలలో ప్రవేశం కల్పించాలని, పెంబి మండలం కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం మాణిక్‌రావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవ్వల్ అంబుస్‌కు డ్రైవర్‌గా ఉద్యోగం కల్పించాలని అర్జీ సమర్పించాడు. పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ప్రజావాణిలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎం హెచ్‌వో బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం ఉన్నారు.

కడుపునొప్పితో వివాహిత ఆత్మహత్య

తాంసి: కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలంలోని కరంజి(టి) పంచాయతీ పరిధిలోని ఇంద్రనగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇంద్రనగర్ గ్రామానికి చెందిన శేండాల రమ(35) భర్తతో కలిసి గ్రామంలో సాగుభూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. కొన్ని రోజులుగా రమ కడుపునొప్పితో బాధపడుతూ ఈ నెల 7వ తేదీన రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతదేహాన్ని రిమ్స్‌లో ఎస్సై లాల్‌సింగ్ నాయక్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. భర్త సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడు..

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... జాదవ్ శ్రీనివాస్ (31) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం తల్లిదండ్రులు తాగవద్దని మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘దళితబంధు’ విషయంలో మహిళలపై దాడి

- కిర్గుల్(కె) గ్రామంలో ఘటన
- భైంసా ఏరియా ఆసుపత్రికి తరలింపు
- ఎమ్మెల్యే సమక్షంలోనే వాగ్వాదం


గాయపడిన జ్యోతిని ఆసుపత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

భైంసా: బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో మహిళలపై గ్రామ సర్పంచు దాడికి దిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం .. బాసర మండలం కిర్గుల్(కె) గ్రామంలో సోమవారం ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇదే సమయంలో గ్రామంలోని కొంతమంది తమకు దళితబంధు రాలేదని స్థానిక సర్పంచ్‌ని అడిగితే మీకెందుకివ్వాలని అంటున్నాడని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే తమకు ఎస్సీ కమ్యూనిటీ హాల్ కావాలని కోరగా ఎమ్మెల్యే హామీ ఇచ్చాడు. గతంలో కమ్యూనిటీ హాల్‌కు నిధులు ఇచ్చినా ఎందుకు నిర్మించుకోలేదని ప్రశ్నించాడు. అదే సమయంలో దళితబంధు స్థానిక సర్పంచు తనకు చెందిన వారికే ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో సర్పంచుకు, స్థానికులకు ఎమ్మెల్యే సమక్షంలోనే వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అక్కడి నుంచి సీసీ రోడ్లు, పంచాయతీ భవనం ప్రారంభించి వెళ్లాడు. ఆ సమయంలోనే సర్పంచు గ్రామానికి చెందిన జ్యోతి, సవితలపై దాడికి దిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. బంధువులు జ్యోతి, సవితలను వెంటనే భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. దళితబంధు విషయంలోనే సర్పంచుతో పాటు గంగాధర్, తుకారం తమపై దాడికి పాల్పడ్డారని బాధితురాలు జ్యోతి ఆరోపించింది.

నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు..

మహిళపై తాను దాడిచేసినట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారని సర్పంచు దేవేందర్ అన్నారు. కొందరు దళారులు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి విక్రయిస్తే తాను అడ్డుకున్నానని, దీంతో వారంతా కలిసి ఇలా మహిళలను రెచ్చగొట్టి తనపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో పూర్తిస్థాయి విచారణ చేస్తే అన్ని విషయాలు వెల్లడవుతాయని, పాత కక్ష్యలతోనే ఇలా తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు.